# ప్రగతి బాటన కమల్‌కోట్

- రూ.1.13 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు
- మౌలిక వసతులకు పెద్దపీట
- ఆనందంలో గ్రామస్తులు


ఎస్సీ కాలనీలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు

మామడ, అక్టోబర్ 12 : బీఆర్ఎస్ హయాంలో కమల్‌కోట్ రూపురేఖలు మారిపోయాయి. సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతితో గ్రామం ప్రగతి పథాన పయనిస్తున్నది. కమల్‌కోట్ గ్రామంలో 2వేల జనాభా, 10 వార్డులు ఉన్నాయి. గత ప్రభుత్వాల హయాంలో డ్రైనేజీలు లేక గుంతల రోడ్లు, తాగునీరు, విద్యుత్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. బీఆర్ఎస్ సర్కారు గ్రామంలో పల్లె ప్రకృతి వనం, డంప్ యార్డు, వైకుంఠధామం, డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టింది. గ్రామం పరిశుభ్రం, పచ్చదనంతో కళకళలాడుతున్నది. ప్రభుత్వం కొనుగోలు చేసిన ట్రాక్టర్‌తో సిబ్బంది నిత్యం చెత్త సేకరించి డంప్ యార్డుకు తరలిస్తున్నారు. వీధులు పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించడంతో అందంగా కనిపిస్తున్నాయి. దోమల నియంత్రణకు స్ప్రే చేస్తున్నారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీరు పడుతున్నారు. దీంతో గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మొక్కలు ఏపుగా పెరగడంతో ఆహ్లాదకరమైన వాతవరణం ఏర్పడింది. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సహకారంతో రూ.93 లక్షలతో కమల్‌కోట్ నుంచి గుమ్మిరాల్ బ్రిడ్జి వరకు బీటీ రోడ్డు, రూ.కోటి పది లక్షలతో 33 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేశారు. ఇప్పటికే టెండర్లు పూర్తి అయ్యాయి. దీంతో త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటి వరకు గ్రామం లో రూ.70 లక్షలతో సీసీ రోడ్డు, రూ. 40 లక్షలతో డ్రైనేజీలు నిర్మించారు. ఎస్సీ కాలనీ నుంచి గోదావరి వరకు పంట పొలాల్లోకి వెళ్లేందుకు మట్టి రోడ్డు రూ.3.50 లక్షలతో వేశారు. మన ఊరు – మన బడిలో భాగంగా రూ.6.50 లక్షలతో పాఠ శాల ప్రహరీ నిర్మించారు.


పల్లె ప్రకృతి వనం



వైకుంఠధామం వైకుంఠధామం


స్వాగత తోరణంలా హరితహారం మొక్కలు

### గ్రామాభివృద్ధే లక్ష్యం..



గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. పల్లె ప్రగతితో కమల్‌కోట్ కొత్త శోభ సంత రించుకున్నది. ప్రజలు, వార్డు సభ్యుల సహకారం తో ప్రణాళిక ప్రకారం నిధులు ఖర్చు చేస్తూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నాం. పంచాయతీకి ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ వంటివి ఉపయోగపడు తున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు గ్రామస్తులు సహకరించాలి. **- రావుల ముత్యంరెడ్డి, సర్పంచ్(కమల్‌కోట్)**

### పల్లె ప్రగతితో మార్పు..



తడి, పొడి చెత్త వేరు చేసేందుకు గ్రామ పంచాయతీ బుట్టలు అందించింది. ఇంట్లో చెత్తను జీపీ ట్రాక్టర్ వచ్చిన తర్వాత అందులో వేస్తున్నాం. పల్లె ప్రగతి కార్యక్రమం మొదలైనప్పటి నుంచి చాలా మార్పు వచ్చింది. మొక్కలు పెంచడంతో పాటు దోమలు రాకుండా ఎప్పటికప్పుడు మందులు పిచికారీ చేస్తున్నారు. ఇప్పటికే పల్లె ప్రగతి కార్యక్రమంలో చేపట్టిన పనులు పూర్తయ్యాయి.

**- బోడ లక్ష్మి, కమల్‌కోట్**

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న సంఘ సభ్యులు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 12 : నిర్మల్ మున్నూ రుకాపు యువజన సంఘం సభ్యుడు కుంటాల శ్రీధర్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని యువజన సంఘం సభ్యులు పరామర్శిం చారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సంఘం తరపున కుటుంబ సభ్యులకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గంట రాకేశ్, ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రవీణ్, ఉపాధ్యక్షుడు వొద్నం నరేందర్, అనిల్, కోశాధికారిగా చిరంజీవి, ఇప్ప శేఖర్, జాప సందీప్, పూదరి శివ, కౌన్సిలర్లు ఎస్పీ రాజు, కొండ సబిత శ్రీధర్, నాయకులు రామ కృష్ణ, గుర్రం సత్యనారాయణ, అంగ జగదీశ్, మహేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## చర్యలు తీసుకోవాలి

భీంపూర్, అక్టోబర్ 12 : మండలం అర్లి(టీ) గ్రామానికి చెందిన దప్కల నవనీత్, నిఖిత దంపతుల కుమారుడు ఆర్యన్ (7) ఆదిలాబాద్‌లోని ఒక ప్రైవేట్ హాస్టల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 9న జ్వరంతో మృతి చెందాడు. ఈ విషయంలో సంబంధిత యాజమాన్యం, వార్డెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే బాలుడు మృతి చెందాడని తల్లిదండ్రులు, గ్రామస్తులు గురువారం డీఈవో ప్రణీతకు వినతిపత్రం అందజేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరామని వారు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉల్లాస్ దేశ్‌ముఖ్, విఠల్, నితిన్, అంబారావు తదితరులు ఉన్నారు.


నిర్మల్ అర్బన్ : పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

## బడుల్లో బతుకమ్మ సంబురాలు..

- ఆడి పాడిన విద్యార్థులు..
- వెల్లివిరిసిన సంప్రదాయం

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 12 : సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ వేడుకలను గురువారం ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో ఘనంగా నిర్వహించారు. నిర్మల్‌లోని వాసవి కిడ్స్, హైస్కూల్, వరల్డ్ పాఠశాల, భాష్యం ఉన్నత పాఠశాల, రవి ఉన్నత పాఠశాల, విజయ హైస్కూల్, శాంతి నికేతన్, వీ కిడ్స్, వేదం పాఠశాల, వశిష్ట ఇంపర్స్ ఇ టెక్నో పాఠశాల, విద్యానికేతన్ పాఠశాల జుమ్మెరాత్ పేట్ పాఠశాల, కస్బా ఉన్నత పాఠశాల, అర్బన్ కేజీబీవీ పాఠశాల, సోఫీనగర్ గురుకుల పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు తీరొక్క పూవులతో బతుకమ్మలను పేరించి సంప్రదాయ వస్త్రాలను ధరించి కోలాటం ఆడుతూ నృత్యం చేశారు. అనంతరం స్థానిక చెరువుల్లో బతుకమ్మను నిమజ్జనం చేశారు.

**సోన్‌లో..**

సోన్, అక్టోబర్ 12 : నిర్మల్, సోన్ మండలా ల్లోని ఆయా గ్రామాల్లోని ఉన్నత పాఠశాల, ప్రాథ మిక పాఠశాలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు గురువారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మను పువ్వులతో పేర్చి ఆటపాటలతో ఆడి సాయంత్రం నిమజ్జనం చేశారు. సోన్‌లోని అభ్యాస గురుకులంతో పాటు, వెంగ్వాపేట్‌లోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో వేడుకలను నిర్వహించారు. హెచ్‌ఎంలు గజ్జారాం, ప్రదీప్ పాల్గొన్నారు.

**పొన్కల్‌లో..**

మామడ, అక్టోబర్ 12 : మండలంలోని పొన్కల్ శ్రీసాయి పాఠశాలతోపాటు పలు పాఠశాలల్లో గురువారం బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మలను పేర్చి కోలాటం ఆడారు. ప్రధాన వీధుల గుండా బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్లి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. హెచ్‌ఎం సిలివేరి అశోక్, ఉపాధ్యాయులు టీ శేఖర్, మంజుల, శోభ, వనజ తదితరులు పాల్గొన్నారు.


పెంబి : బతుకమ్మలతో విద్యార్థులు


సోన్ : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

## వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సోన్, అక్టోబర్ 12 : ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం, నగదు తరలిస్తే సీజ్ చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు. సిబ్బంది పాల్గొన్నారు.